క్లుప్తంగా

సంపూర్ణ పోషకాహార కిట్ల పంపిణీ

కడియం: జేగురుపాడులోని అంగన్‌వాడీ సెంటర్లలో బాలింతలు, గర్భిణులకు బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఆ గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. స్టాలిన్ మాట్లాడుతూ ప్రతినెలా ఈ కిట్లను ఇంటి వద్దకే అందజేస్తారన్నారు.

విద్యాశాఖ వర్క్‌షాప్‌నకు చిలుకూరి


చిలుకూరి శ్రీనివాసరావు

కడియం: విజయవాడలోని హోటల్ గేట్ వేలో జరగనున్న విద్యాశాఖ స్టేట్ వర్క్‌షాప్‌నకు హాజరుకావాలంటూ తనకు ఆహ్వానం అందిందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు తెలిపారు. సుపరిపాలన, సాంకేతికతతో కూడిన పాఠశాల విద్యను ఉపయోగడం ద్వారా జీవన సౌలభ్యాన్ని ప్రోత్సహించడం అనే అంశంపై ఈ వర్క్‌షాప్ జరుగుతుందన్నారు. విద్యాశాఖ అధికారులు, నిష్ణాతులైన ఉపాధ్యాయులు, అవార్డు గ్రహీతలు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు.

6న జక్కంపూడి రామ్మోహనరావు జయంతి

సాక్షి, రాజమహేంద్రవరం: జక్కంపూడి రామ్మోహనరావు జయంతి సందర్భంగా ఈనెల 6న కంబాలచెరువు జంక్షన్‌లోని ఆయన విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహిస్తామని ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తెలిపారు. స్థానిక ట్రైనింగ్ కళాశాల వద్ద జక్కంపూడి, వంగవీటి రంగా, నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి మురళి నేతృత్వంలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాతావరణం అనుకూలిస్తే అదే రోజున వాటిని ఆవిష్కరిస్తామన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ వాసం శెట్టి గంగాధరరావు, మానే దొరబాబు, బొంతా శ్రీహరి, రంగా మిత్రమండలి నాయకులు వడ్డి మురళీ, నాయకులు నరవగోపాల కృష్ణ, డీవీ రెడ్డి, వైకేఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం


పనులు ప్రారంభిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

ప్రకాశం నగర్: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ చేస్తున్న సేవలు అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. బుధవారం రాజానగం ఏడీబీ రోడ్డులోని 30 సంవత్సరాల మర్రి వృక్షాన్ని అక్కడ నుంచి శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించి వేరొక చోట నాటడానికి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పచ్చదనం పరిరక్షణలో భాగంగా క్లబ్ చేస్తున్న పనులు ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సంపత్, డీఎఫ్‌ఓ నాగరాజు, క్లబ్ అధ్యక్షుడు తీగెల రాజా, ఉపాధ్యక్షుడు వెంకన్న బాబు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు సర్వే

రాజమహేంద్రవరం సిటీ: ఓటరు జాబితాపై ఇంటింటి సర్వేను అత్యంత పారదర్శకం నిర్వహించాలని కార్పొరేషన్ కమిషనర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు. ఆయన బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి కమిషనర్, బీఎల్‌వోలు, సూపర్ వైజర్లతో సమీక్షించారు.

నేడు ఐటీఐ కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ధవళేశ్వరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పి.పరమేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 5 నుంచి ఏడో తేదీ వరకూ సంబంధిత ఐటీఐకి నేరుగా కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలన్నారు.

బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి


సత్యనారాయణ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: బైక్‌పై నుంచి పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వీఎల్ పురానికి చెందిన అడపా వీర వెంకట సత్యనారాయణ (66) హుకుంపేట జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ ప్రైవేటు స్కూల్లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో 100 అడుగుల రోడ్డులో నుంచి బైక్‌పై హుకుంపేట జాతీయ రహదారిపైకి వస్తున్నాడు. ఈలోగా సడన్‌గా బైక్ పైనుంచి పడిపోవడంతో స్పృహ కోల్పోయాడు. వెంటనే అతడిని స్థానికులు 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ఆయన మృతి చెందాడు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణకు భార్య, కుమారుడు ఉన్నారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్లు చందన నాగేశ్వర్, గూడూరి శ్రీనివాస్
- ప్రభుత్వ సాయం పంపిణీ


వరద బాధితులకు ప్రభుత్వ సాయం అందజేస్తున్న రూరల్, సిటీ కోర్డినేటర్లు చందన నాగేశ్వర్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వరద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచిందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. గోదావరి వరద నేపథ్యంలో గోదావరి లంకల్లో నివాసముంటున్న 125 కుటుంబాలకు చెందిన 357 మందికి ఆల్కాట్‌తోట మున్సిపల్ కల్యాణ మండపంలో పునరావాసం కల్పించారు. వారం రోజులుగా వారికి భోజనం, ఇతర అన్ని సౌకర్యాలు అందజేశారు. వరద తగ్గుముఖం పట్టడంతో బుధవారం 125 కుటుంబాలు లంక గ్రామాలకు పయనమయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున కుటుంబానికి రూ.2 వేలు, 25 కిలోల బియ్యం, వంటనూనె, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళా దుంపలు, నిత్యావసరాలు అందించారు. చందన నాగేశ్వర్, గూడూరి శ్రీనివాస్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సత్యవేణి, తహసీల్దార్ సుస్వాగతం, ఎంఎస్‌వో మల్లేశ్వరి, జేసీఎస్ కన్వీనర్లు కొప్పిసేడి ప్రసాద్‌బాబు (రాజమౌళి), తాటికొండ విష్ణు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి సీఎం జగన్ కృషి

- కోఆర్డినేటర్ శ్రీనివాస్
- ఉత్సాహంగా గడప గడపకూ..


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో అభివృద్ధి, పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. 48వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అజ్జరపు వాసు ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నగరంలో ఎంపీ భరత్ రామ్ చేస్తున్న అభివృద్ధికి ప్రతిపక్ష నాయకులు అడుగడుగునా అడ్డు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మహిళా నాయకులు కొత్త విజయ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం

ధవళేశ్వరం: మహిళా సంక్షేమానికి టీడీపీ ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పందూరి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన మహాశక్తి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళా నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగారు.

ప్రతి విద్యార్థీ నవోదయకు పోటీ పడాలి


వేమగిరిలో మాట్లాడుతున్న నవోదయ ప్రతినిధి సుధీర్

కడియం: ప్రతి విద్యార్థీ నవోదయ విద్యాలయకు పోటీ పడాలని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని పెద్దాపురం నవోదయ ప్రతినిధి సుధీర్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని వేమగిరితోట రామాలయం వీధి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుళ్ల ప్రాథమిక పాఠశాల 1 నుంచి ముగ్గురు విద్యార్థులు ఈ ఏడాది నవోదయకు ఎంపికయ్యారన్నారు. ఎంఈవో వి.లజపతిరాయ్, హెచ్‌యం కె.జయరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే సుధీర్ వివిధ పాఠశాలలను సందర్శించి నవోదయ దరఖాస్తు సంబంధిత బ్రోచర్లను ఆయా స్కూలు ఉపాధ్యాయులకు అందజేశారు.

ఎరువుల వాడకంపై అవగాహన అవసరం


పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, శాస్త్రవేత్తలు

రాజమహేంద్రవరం రూరల్: సాగులో ఎరువులు, పురుగుమందుల వాడకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం రాజవోలు గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ ఎం.నందకిషోర్, సీనియర్ శాస్త్రవేత్త (విస్తరణ) కె.అచ్యుత రాజు, మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఎం.శ్రీనివాస్, పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శర్మ, బాలాజీ నాయక్ పాల్గొని రైతులకు సూచనలు చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్త వరిరకం ఎంటీయూ 1318 సాగు పద్ధతులు, ఎరువుల యాజమాన్యంపై రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ రకానికి ఎరువులను ముఖ్యంగా యూరియాను ఎకరానికి 30 కిలోల కంటే ఎక్కువ వాడరాదన్నారు. అనంతరం రాజవోలులోని వరి పొలంలో ఎక్వాటిక్ (నీటిలో పెరిగే పిన్నియా, మార్సీనియా పెసర జాతి కలుపు) కలుపు నివారణకు కొత్త కలుపు మందు నోస్‌లెక్ట్ (ఫ్లోర్‌పైరాక్సిఫెన్‌బెంజైల్+సైహాల్‌ఫాస్‌బ్యుటైల్) పిచికారీ చేసి రైతులకు, వ్యవసాయ అధికారులకు డిమాన్‌స్ట్రేషన్ (ప్రదర్శన) నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాస రెడ్డి, వ్యవసాయాధికారి భీమరాజు, వ్యవసాయ విస్తరణాధికారులు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన


మొక్క నాటుతున్న పాఠశాల సిబ్బంది, విద్యార్థులు

కంబాలచెరువు: మోరంపూడిలోని ది పార్కు ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థులు బుధవారం హరిత భారత్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మానవుల మనుగడకు మొక్కలు ఆధారమని నినాదాలు చేశారు. గణేష్ నగర్‌లో ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. అలాగే పలు మొక్కలను నాటారు. ప్రిన్సిపల్ పి.మహేశ్వరరావు, పాఠశాల ఏజీఎం వైఎస్ శ్రీనివాస్, రీజినల్ ఇన్‌చార్జి వై.రామాంజనేయులు, అకడమిక్ కోఆర్డినేటర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జీవకారుణ్య సంఘం ఆస్తులను పరిరక్షిస్తాం


మాట్లాడుతున్న బర్రే కొండబాబు

రాజమహేంద్రవరం సిటీ: గౌతమీ జీవకారుణ్య సంఘం ఆస్తులను పరిరక్షించడానికి శక్తివంచన లేకుండా తమ కార్యవర్గం పనిచేస్తుందని చైర్మన్, మాజీ కార్పొరేటర్ బర్రే కొండబాబు తెలిపారు. ఎంపీ భరత్‌రామ్ సూచనల మేరకు ఈనెల 5వ తేదీన గౌతమీ జీవకారుణ్య సంఘం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పాలకమండలి సభ్యులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కొండబాబు మాట్లాడుతూ గౌతమీ జీవకారుణ్య సంఘం ఏర్పడి 83 ఏళ్ల అవుతుందన్నారు. ఇన్నేళ్లలో ఎప్పుడు పాలక మండలి చైర్మన్‌గా దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించలేదన్నారు. ఎంపీ భరత్ రామ్ చొరవతో తొలిసారిగా ఈ సంస్థకు ఎస్సీని చైర్మన్‌గా నియమించారన్నారు. సంస్థకు సంబంధించిన షాపులు, భూముల లీజు విషయాలు పారదర్శకంగా జరిగేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు బత్తిన అన్నవరం, అడపా వెంకట రఘునందన్ నాగులపల్లి దేవి, తమ్మిశెట్టి రాధిక, పైడా ఉష, చొల్లంగి ఏడుకొండలు, చిట్టాబత్తుల అనంతలక్ష్మి, పిల్లి నాగేంద్ర ప్రసాద్, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

గౌరవ వేతనానికి, జీతానికీ తేడా తెలియదా!

రాజమహేంద్రవరం సిటీ: పదేళ్ల పాటు పార్లమెంట్ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు వలంటీర్లకు ఇచ్చే గౌరవ వేతనానికి, జీతానికి మధ్య వత్యాసం తెలియక పోవడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ నాయకుడు, గోదావరి పరిరక్షణ సమితి చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగనన్న సురక్ష అద్భుతమైన కార్యక్రమం అన్నారు. దీనిద్వారా గత 31 రోజుల్లో 5,77,753 మందికి సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఇది ప్రభుత్వ ఆదేశాలతో వలంటీర్ల వల్లనే సాధ్యమైందన్నారు. వలంటీర్ల ఖర్చుల కోసం ప్రభుత్వం రూ.5 వేలు గౌరవ వేతనం ఇస్తోందన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా వలంటీర్లపై విమర్శలు చేయడం తగదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎల్‌వీ ప్రసాద్, భద్రరావు, అప్పారావు, సప్పా ఆదినారాయణ, రవీంద్ర, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి స్ఫూర్తితో పోరాటం


సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

ప్రకాశం నగర్: కందుకూరి వీరేశలింగం స్ఫూర్తితో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి పిలుపునిచ్చారు. హింసపై మహిళల పోరుయాత్ర పేరుతో ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రజాతా బుధవారం నగరానికి చేరుకుంది. గోకవరం, కోరుకొండ మీదుగా రాజమహేంద్రవరం చేరుకున్న యాత్రకు కందుకూరి రాజ్యలక్ష్మి స్త్రీల కళాశాల విద్యార్థినులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రభావతి మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న అమానుష ఘటనలకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 79 రోజుల వరకూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రాజా మాట్లాడుతూ విద్యార్థి, మహిళా ఉద్యమాలకు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.పూర్ణ, సహాయ కార్యదర్శి రమణి, జిల్లా అధ్యక్షురాలు జరీనా పాల్గొన్నారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాడు – నేడు పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. పాఠశాలల వారీగా పనుల ప్రగతిని సమీక్షించారు. వివరాలను ఎస్‌టీఎంఎస్ ఆండ్రాయిడ్ అప్లికేషన్‌లో ఎప్పటికప్పుడు అప్లోడ్ యాలన్నారు. ఫార్మేటివ్ 1 పరీక్షలు పూర్తి అయిన వెంటనే ఇవ్వబడిన ప్రొఫార్మా ప్రకారం వివరాలు పూర్తి చేసి ఓఎమ్ఆర్ షీట్ లను కార్యాలయానికి సబ్మిట్ చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అత్యంత జాగ్రత్తగా అమలు చేయాలన్నారు.

తెలుగు జాతి కీర్తి పతాకం పింగళి వెంకయ్య


పింగళి వెంకయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సంజీవరావు తదితరులు

సీటీఆర్ఐ: తెలుగు జాతి కీర్తి పతాకం పింగళి వెంకయ్య అని అని తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు అన్నారు. మువ్వన్నెల జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని గౌతమీ లైబ్రరీలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ వెంకయ్య జీవితం, పోరాటం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆర్థిక శాఖాధిపతి మారిశెట్టి ఫణి కుమార్, భారత వికాస్ పరిషత్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పీఈఎస్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కంబాలచెరువు: మువ్వన్నెల జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య మన తెలుగువాడు కావడం అందరికీ గర్వకారణమని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జె.అప్పారావు, ఉపాధ్యాయురాలు విజయకుమారి, పుష్పాల బాపిరాజు, పీఈటీ మూర్తి పాల్గొన్నారు.

ఎంపీ భరత్‌రామ్‌పై విమర్శలు తగవు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: అభివృద్ధికి చిరునామాగా మారిన ఎంపీ మార్గాని భరత్‌రామ్‌పై విమర్శలు చేసేవారు ఆత్మ పరిశీలన చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కడలి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం, అర్బన్ బ్యాంక్‌ల డైరెక్టర్లు బిల్డర్ చిన్నా, గుత్తుల భాస్కర్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ భరత్ రామ్ చొరవతో మోరంపూడి ఫ్లైఓవర్‌ను రూ.56 కోట్లతో నిర్మిస్తున్నారని, అనపర్తి, నిడదవోలు రైల్వేస్టేషన్ల అభివృద్ధికి రూ.47 కోట్లు మంజూరు చేయించారన్నారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. సిటీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్ సుమారు 30 వేల మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాటం ప్రియాంక, సప్పా ఆదినారాయణ, గేడి అన్నపూర్ణ రాజు, నందం స్వామి పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ


కోలమూరులో కిట్ల పంపిణీలో పాల్గొన్న ప్రముఖులు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కోలమూరు గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, పంచాయతీ కార్యదర్శి విజయారెడ్డి, పార్టీ నాయకులు చెరుకూరి సత్యనారాయణ, దారా వెంకటకృష్ణ, అడ్డాల ఆనందరావు, పిల్లి సూర్యారావు, సూపర్‌వైజర్ మేరీల చేతులమీదుగా అందించారు. పిడింగొయ్యి జైహింద్ నగర్‌లో వెంకటగిరి-2 ఏరియాలకు సంబంధించి అంగన్‌వాడీ కేంద్రాలలో హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, సచివాలయ కన్వీనర్లు పంపిణీ చేశారు. హుకుంపేట ఎంపీపీ స్కూల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మాజీ సొసైటీ చైర్మన్ కురుమళ్ల ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.సంగేణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అందజేశారు.

జాబ్‌మేళాలతో ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, చిత్రంలో రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: జాబ్‌మేళాలతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. పార్టీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌తో కలిసి బుధవారం కడియంలో జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. చందన నాగేశ్వర్, పార్టీ నాయకుడు సాకా పట్టాభి.. వికాస సౌజన్యంతో ఈ జాబ్‌మేళాను కడియంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాగా.. జాబ్‌మేళాలో 19 కంపెనీలు పాల్గొనగా, వివిధ కేటగిరీల్లో 314 మందికి నియామక పత్రాలను వెంటనే అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, కడియపులంక సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, పార్టీ నాయకులు దాసరి శేషగిరి, హరిశ్చంద్ర, ఆచంట కల్యాణ్, ఊటుకూరి శైలజ, పెనుమాక సునీల్, కళ్యాణ్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతినెలా మూడు టన్నుల సార్టెక్స్ బియ్యం పంపిణీ


బొమ్మూరులోని ఎంఎల్ఎల్ పాయింట్‌లో తూకాన్ని పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం పరిధిలోని మండల లెవెల్ స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్) ద్వారా ప్రతినెలా మూడువేల టన్నుల సార్టెక్స్ బియ్యం పంపిణీ చేస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ తెలిపారు. బొమ్మూరులోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యావసర సరకులను సరైన తూకంలో ఎంఎస్ఎల్ పాయింట్ నుంచి సరఫరా చేస్తున్నామన్నారు. ఈ పాయింట్ ద్వారా రాజమహేంద్రవరం రూరల్, అర్బన్, కడియం, రాజానగరం పరిధిలోని 256 చౌకధరల దుకాణాలకు బియ్యం, పంచదార, పామయిల్‌ను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ షాపుల ద్వారా ప్రతి నెలా 19వ తేదీ నాటికి ఇండెంట్ వివరాలు సేకరించి ఆ మేరకు సరఫరా చేయడం జరుగుతోందన్నారు. పౌష్టిక విలువలతో కూడిన సార్టెక్స్ బియ్యాన్ని ప్రజా పంపిణీ ద్వారా అందజేస్తున్నట్టు జే భరత్ తెలిపారు. జిల్లా పౌరసరఫరాల అధికారి కె.విజయ భాస్కర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఏ.కుమార్, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి ఎం.కృష్ణ సుధీర్ పాల్గొన్నారు.

ఎండీయూ వాహనం తనిఖీ

స్థానిక ఇన్నీసుపేట వద్ద మొబైల్ డెలివరీ యూనిట్ వాహనం (ఎండీయూ) ద్వారా నిత్యావసరాలు పంపిణీ జరుగుతున్న తీరును బుధవారం జేసీ తేజ్ భరత్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొవ్వూరులో ప్రభుత్వ కార్యక్రమానికి వెళుతున్న ఆయన.. ఎండీయూ వాహనాన్ని చూసి ఆగారు. తూకం, ఆన్‌లైన్‌లో నమోదు, బయో మెట్రిక్, ఐరిష్ పనితీరును పరిశీలించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి రేషన్ పంపిణీ తీరును తెలుసుకున్నారు.

ఆడుదాం ఆంధ్రాకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రకాశం నగర్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 'ఆడుదాం ఆంధ్రా' టోర్నమెంట్‌లో భాగంగా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ అక్టోబర్ రెండు నుంచి ఐదు విభాగాల్లో ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా ముఖ్య క్రీడా శిక్షకులు డీఎంఎం శేషగిరి తెలిపారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు జరుగుతాయన్నారు. నాన్ కాంపిటేటివ్ విభాగంలో యోగా మారథాన్, సాంప్రదాయ క్రీడలో 17 ఏళ్ల పైబడిన వారు పాల్గొనవచ్చన్నారు. ఇందుకోసం ఈనెల 7 వరకూ స్పోర్ట్స్.ఏపీ.జీవోవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రైల్ కోచ్ రెస్టారెంట్ ప్రారంభం


ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు


రైల్వేకోచ్ రెస్టారెంట్ లోపల ఏర్పాట్లు

రాజమహేంద్రవరం సిటీ: దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో గోదావరి ఫుడ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో సిద్ధం చేసిన రైల్ కోచ్ రెస్టారెంట్‌ను బుధవారం స్టేషన్ మేనేజర్ గంగా ప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రైలు ప్రయాణికులు, నగర ప్రజలకు 24 గంటలూ నాణ్యమైన వెజ్, నాన్‌వెజ్ రుచులు అందజేయనున్నారు. ప్రారంభోత్సవంలో స్టేషన్ చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ సుంకర చంద్రమౌళి, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.

పిల్లలకు ముర్రుపాలు అత్యవసరం


బొబ్బిల్లంక అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార కిట్ల పంపిణీ

సీతానగరం: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు అత్యవసరమని, వాటివల్ల వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.ఇందిరా భారతి తెలిపారు. బొబ్బిల్లంకలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి తల్లిపాల వారోత్సవాన్ని బుధవారం స్థానిక రెండో నంబర్ అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) అందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇందిరా భారతి మాట్లాడుతూ పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. టీహెచ్ఆర్‌లో మూడు కిలోల ఫోర్టిఫైడ్ బియ్యం, కిలో కందిపప్పు, అరకిలో పామాయిల్, 13 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలను సర్పంచ్ మెల్లిమి రామచంద్రరావు, ఉప సర్పంచ్ కోమలి వీరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిన చౌదరి, ఎంపీటీసీ చిన్ని అందజేశారు. అలాగే వైఎస్సార్ పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పి.రాధారాణి, జె.గంగాభవాని పాల్గొన్నారు.